

సాహితీ సదస్సులో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

ఆంధ్రజ్యోతి

# సాహితీ సంపదను పరిరక్షించాలి

## మండలి బుద్ధప్రసాద్

ఉయ్యూరు రూరల్, అక్టోబర్ 22 (ఆన్‌లైన్): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సాహితి సంపదను సంరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్, మహాకవి గురుజాడ అప్పారావు 150వ జయంతి సందర్భంగా ఏజీ అండ్ ఎస్‌జీ సిద్దార్థ కళాశాల సాహితీ సాంస్కృతిక విభాగం, జిల్లా రచయితల సంఘం, సరసభారతి ఆధ్వర్యాన శనివారం కళాశాల ఆడిటోరియంలో సాహితి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, మహాకవుల సాహిత్యం మరుగున పడుతున్న నేపథ్యంలో యువతకు అవగాహన కలిగించేలా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు కేసీపీ జీఎం జి.వెంకటేశ్వరరావు, సరసభారతి గౌరవాధ్యక్షురాలు జె.శ్యామలాదేవి హాజరయ్యారు. రవీంద్రుని గీతాంజలి గురించి మాదిరాజు రామలింగేశ్వరరావు, గురజాడ కన్యాశుల్కం గురించి ద్వానా శాస్త్రి, గురజాడ జీవితం-సామాజిక పరిస్థితులపై ఎస్.వి.ప్రసాద్, వివరించారు. రెండో సదస్సులో సరసభారతి అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్, ఎస్.వి.రావు, లావణ్య పత్ర సమర్పణ చేయగా గుమ్మా సాంబశివరావు గురజాడ ఇతర రచనలు తెలిపారు. ప్రిన్సిపాల్ బి.వి.రాయుడు కార్యక్రమ విశిష్టతను వివరించారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు.

ఈనాడు - 23-10-11

# సాహిత్యంతోనే మానవతా విలువలు

## జి.ర.సం. గౌరవాధ్యక్షుడు బుద్ధప్రసాద్

**ఏ.జి.ఎస్.జి.ఎస్. క్యాంపస్ (ఉయ్యూరు) న్యూస్‌టుడే:** సాహిత్యాభివృద్ధితో మానవతా విలువలు పెరుగుతాయని కృష్ణా జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎ.జి.ఎస్.జి.ఎస్. కళాశాల సాహితీ, సాంస్కృతిక విభాగం, జిల్లా రచయితల సంఘం, సరస భారతిల ఆధ్వర్యంలో కళాశాలలో శనివారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, మహాకవి గురజాడ వెంకట అప్పారావుల 150వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటైన సాహితీ సదస్సుకు మండలి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మరో అతిథిగా హాజరైన కె.సి.పి. జనరల్ మేనేజరు జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుభాషలోని తియ్యదనం మరెందులోనూ ఉండదని అన్నారు. కార్యక్రమానికి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షత వహించారు. సరసభారతి అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, జె.శ్యామలాదేవి, ప్రిన్సిపల్ బి.వెంకటరాయుడు, రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వి.పూర్ణచంద, అధ్యాపకుడు ఎ.ఎస్.ఎస్.ఎన్.వి.ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ప్రిన్స్‌పల్ బి.వెంకటరాయుడుకు బుద్ధప్రసాద్ ఘనంగా సన్మానించారు. సాహిత్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల్ని అందజేశారు. రవీంద్రుని గీతాంజలిపై డాక్టర్ మాదిరాజు రామలింగేశ్వరావు, గురజాడ కన్యాశుల్కంపై డాక్టర్ ద్వానా శాస్త్రి, గురజాడ జీవితంపై ప్రసాద్‌లు పత్రసమర్పణ చేశారు.

# 22న ఉయ్యూరులో సాహితీ సదస్సు

**ఉయ్యూరు, న్యూస్‌టుడే:** కృష్ణాజిల్లా రచయితల సంఘం, ఎ.జి.ఎస్.జి.ఎస్ డిగ్రీ కళాశాల సాహితీ ... ...సంస్కృతిక వి...క, సరసభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉయ్యూరులో సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయిత... సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు ... ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఇలాంటి సదస్సు... ...లు ఎంతో ప్రయోజన యోగ్యంగా ఉంటాయన్నారు. ... ఈ సదస్సుకు జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. 22 ఉదయం పది గంటలకు సదస్సు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని అన్నారు.

# యువతా మేలుకో... సాహిత్య సంపద తెలుసుకో..

ఆంధ్రప్రభ

## మండలి బుద్ధ ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న మండలి బుద్ధ ప్రసాద్

**ఉయ్యూరు, అక్టోబరు 22 (ఐఎన్ఎన్) :** పాశ్చాత్య ఫ్యాషన్ ప్రపంచంలో తేలియాడే నేటి ఆధునిక యువత సాహిత్య సంపదగా పేరొందిన దివంగత విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, మహా కవి గురజాడ అప్పారావుల గురించి తెలుసుకోవాల్సిన అత్యవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి, కృష్ణాజిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ పిలుపు నిచ్చారు. ఇటువంటి మహనీయుల సేవలను ఇంటా, బయటా మననం చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరిలో మంచి సద్గుణాలు ఏర్పడతాయని, తద్వారా సమాజాభివృద్ధి ముఖ్యంగా మానవాళి సేవ సుసాధ్యమవుతుందనే ఆకాంక్షను వెలిబుచ్చారు. రవీంద్రనాథ్ ఠాగూర్, గురజాడ అప్పారావులు జన్మించి 150 ఏళ్ళు అయిన సందర్భంగా మహనీయుల ఆశయాలు, ఆదర్శాలను నేటి యువ తరానికి అందించాలనే ఉద్దేశ్యంతో ఉయ్యూరు ఎజి, ఎస్‌జి సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో శనివారం ఒక సాహితీ సదస్సు జరిగింది. జిల్లా రచయితల సంఘం, ఉయ్యూరు సరసభారతి, కళాశాల నిర్వాహకుల సంయుక్త ఆధ్వర్యాన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా మండలి బుద్ధప్రసాద్ హాజరయ్యారు. అనంతరం సభికులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వకవిగా ఖ్యాతిని ఆర్జించిన రవీంద్రనాథ్ ఠాగూర్, గురజాడ అప్పారావు మహాకవిగా పేరొందారని ఈ సందర్భంగా కొనియాడుతూ ఘన నివాళులర్పించారు. మానవాళికి ఇరువురు మహనీయులు చేసిన సేవలు ముఖ్యంగా సాహిత్యానికి వీరందించిన సంపదను ప్రతి ఒక్కరూ ఒకసారైనా స్మరించుకోవాలని కోరారు. మరో అతిథిగా హాజరైన కె.సి.పి జనరల్ మేనేజరు జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కన్యాశుల్కం అనగానే గురజాడ, గీతాంజలి అనగానే రవీంద్రనాథ్ ఠాగూర్‌లు తక్కున గుర్తుకొస్తారన్నారు. అయితే నేటి యువత వీరి సేవల గురించి తెలుసుకోవాలన్నారు. ఇటువంటి సదస్సుల ద్వారా ఆ మహనీయుల ఆదర్శాలను ప్రస్తుత యువతరం దరికి తీసుకువెళ్ళాలనే ఒక మంచి ఆశయంతో అడుగులేస్తోన్న ఎజి, ఎస్‌జి డిగ్రీ కళాశాల కృషి నిజంగా అజరామమని వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులను కొనియాడారు. విద్యార్థిని వి రమ్యశ్రీ గురజాడ రచనపై చేసిన ఉపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. ఫ్లోరా పాఠశాల బాల బాలికలు గురజాడ వారి దేశమంటే మట్టి కాదోయ్ అనే గేయాన్ని చక్కగా పాడడం ద్వారా సభికుల ప్రశంసలు చూరగొన్నారు. సరస భారతి గౌరవాధ్యక్షురాలు జోశ్యుల శ్యామలాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ బి వెంకట రాయుడు, సాహితీవేత్తలు డాక్టర్ మాదిరాజు రామలింగేశ్వర రావు, డాక్టర్ ధ్వానా శాస్త్రి, ప్రసాద్, సరసభారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్, ఎన్ వి రావు తదితరులు పాల్గొన్నారు.



గురజాడ రచనపై ఉపన్యాసం చేస్తున్న విద్యార్థినులు

# సంగీత మూర్తిత్రయం

శ్రీ సరస్వతీదేవి స్తనద్వయంలో ఒకటి సంగీతం, రెండవది సాహిత్యం. సంగీతం ఆపాదముద్రణమైతే, సాహిత్యం ఆలోచనామృతం. సంగీతం రాగ, తాళ, లయాన్వితంగా ఆహ్లాదపరుస్తుంది. అదిజంత్రంగా, గాత్రంగా రెండురకాలు. శూన్యమైన ఆకాశంలో 'ఓంకారం' ముందు జనించింది. అదే ప్రణవం. దానినుంచి శబ్దప్రపంచం అంతా ఉద్భవించింది. శివుని పంచముఖాలనుండి ఆవిర్భవించిన పంచనాదాలు సప్తస్వరాలైనాయి. వేదాలలో సామవేదం సంగీత స్వరబద్ధం. కలిసిపోయిన వాటిలో రెండు లేక మూడు రంగుల్ని మాత్రమే మన కన్ను విడమర్చి చూడగలదు. కాని, కర్ణేంద్రియం (చెవి) ఇరవై ఒకటికి పైగా, శబ్దతరంగాలను విభజించి, గుర్తించగల విశేష ప్రజ్ఞ కలిగివుంది. అందుకే మన సంగీతం మందరం, మధ్యమం, తారము అనే మూడు స్వరదశల్ని సప్తస్వరాలనే 21 సూక్ష్మభాగాలుగా విభజించి, పూర్ణత్వం పొందింది. దీనివల్ల సర్వప్రపంచ జాతులకు ఐక్యత, ఆనందం కల్గిస్తోంది. ఈ ఐక్యతాగుణం కల్గిన 'గానకళ'కు, దైవత్వం ఆరోపించి, భారతీయులు ధన్యత చేకూర్చారు. సరస్వతీదేవి, నారద, తుంబురాదులు అపారసంగీతజ్ఞులు. కిన్నెర, కింపురుషుల జీవనం సంగీతమయం. గంధర్వులు గాంధర్వగానానికి ప్రతీకలు.

**గబ్బిట దుర్గాప్రసాద్, అధ్యక్షులు, సరసభారతి, ఉయ్యూరు.**

భారతీయ సంగీతంలో రెండు సంప్రదాయాలున్నాయి. ఉత్తరదేశవాసులది 'హిందుస్థాని' సంగీతం. ఇందులో గ్వాలియర్, మహారాష్ట్ర, బెంగాల్ 'ఘరానా'లు ప్రసిద్ధమైనవి. హిందుస్థాని సంగీతాన్ని 'హనుమద్గానం' అంటారు. సమగ్రమైన దక్షిణ భారతదేశంలోని సంగీతాన్ని 'కర్ణాటక సంగీతం' అంటారు. దీనికే 'నారదగానం' అనీ పేరు. కర్ణాటక సంగీతం అంటే కర్ణాటక రాష్ట్రంలోని సంగీతం కాదు. శాతకర్ణి నాడు కర్ణినాడై, కర్ణాటకంగా మారింది. అంటే గోదావరి నది నుండి కావేరి నది పర్యంతం కర్ణాటక సంగీత సంప్రదాయం వుంది. శ్రీనాథమహాకవి కూడా 'ఎవ్వరేమనుకొన్న నాకేమి కొదువు, నిజము, నాదుభాష కర్ణాటభాష' అని రాజమహేంద్రవరంలో అన్నమాట మనం మరచిపోరాదు.

తెలుగుభాష 'అజంత'మైనదని మనకు తెలుసు. అందుకే మధురంగా, కర్ణపేయంగా, ఉచ్చారణ సులభంగా వుంటుంది. సంగీతానికి ప్రధానవాహకంగా మారింధి. కనుకనే, దక్షిణ ప్రాంతాలవారంతా 'ఆంధ్ర వాగ్గేయకారులు' అయ్యారు. సుమారు 80 ఏళ్లకు ముందు తమిళనాడులో 'తమిళ ఇసై' ఉద్యమం వచ్చింది. పాపనాశన్ శివం, యం'ఎస్. సుబ్బలక్ష్మి వంటి సంగీతకారులు తెలుగు గీతాలను పాడము అని భీష్మించుకొని, తమిళ గీతాలే పాడేవారు సంగీత కచేరీల్లో. అయితే అవి వెగటుపుట్టి, రక్తికట్టలేదు. సంస్కృత పండితుడు, మహావక్త అయిన శ్రీ ఎస్. సత్యమూర్తిగారు వీరందర్ని ఎదిరించి నిలిచాడు. తెలుగు మాధుర్యం ఇంకో భాషకు రాదు అని వాదించి, 'బొగ్గులకోసం కల్పతరువును నరుకుతున్నారు' అని ఈసడించాడు. తమిళ గాయకులు అప్పుడు కళ్లుతెరిచారు. నోళ్లూ తెరిచి, తెలుగు గీతాలు పాడి, ప్రాయశ్చిత్తం చేసుకున్నారు. దీనిలో 'తెలుగు ఇసై' తమిళనాట మళ్ళీ విజృంభించింది. తాళం వేయటమేకాదు, చెంపలూ వేసుకొన్నారు. అందుకే శ్రీ రాయవరపు సుబ్బారావు తన గీతి అరవజాతికి పాఠకులుగా దిద్ది వర్ధిల్లిన తెలుగువాణి' అని తెలుగుకు కీర్తికిరీటం పెట్టారు.


## సంగీత త్రిమూర్తులు

కర్ణాటక సంగీత ప్రపంచానికి శ్రీ శ్యామశాస్త్రి (1768), శ్రీ ముత్తుస్వామి దీక్షితులు (1775), శ్రీ త్యాగరాజు (1783). ఈ మూర్తిత్రయం సంగీత శాస్త్రాన్ని, గానాన్ని అందించారు. ప్రసిద్ధ వాగ్గేయకారులైనారు. ఈ ముగ్గురు సమకాలికులవటం కర్ణాటక సంగీతం చేసుకున్న పుణ్యం. త్యాగయ్యకు 50వ ఏట (1813) తిరువాన్కూర్ మహారాజు స్వాతి తిరునాళ్ జన్మించారు. కీర్తనలు ప్రక్రియలు రచించాడు. 33 సంవత్సరాలే జీవించినా, సంగీత చరిత్రలో ఉజ్వల తార అయ్యారు. వీరితో కలిపి 'సంగీత చతుష్టయం' ఏర్పడింది. అన్ని ప్రాంతాల సంగీతవిద్వాంసులు తిరువాన్కూర్ సంస్థానంలో సన్మానాలు పొందారు. స్వాతి తిరునాళ్ మహారాజు చేత శ్యామశాస్త్రి తెలుగు, సంస్కృతంలో, దీక్షితులు సంస్కృతంలోను, త్యాగయ్య తెలుగులోనే ఎక్కువగా కీర్తనలు వ్రాశారు. ఈ మూర్తిత్రయాన్నే 'సంగీత త్రేతాగ్నులు' అన్నారు. వీరంతా తమిళనాడులోని 'తిరు ఆరూర్' (ఆరుపల్లెల కూడలి)లోనే జన్మించారు. ముగ్గురు, దగ్గరలో వున్న 'తిరువైయ్యార్' (ఐదు ఏరులకూడలి) చేరారు. దీనినే 'పంచనదీతీరం' అంటారు. కావేరి నదిని 'సహ్యజ' అంటారు. సహ్యపర్వతాలలో పుట్టిన నది. ఆ నీటిలో ఏదో అవ్యక్త మాధుర్యం వుంది. ఆ ముగ్గురి కంఠాలను మధురమూర్ఛనలతో నింపింది. అలౌకిక సంగీతాన్ని వినిపింపజేసింది. పారవశ్యం కల్గించి, సంగీతంలో 'నాయకస్థానం' సంపాదించింది. అంతకు పూర్వం అంటే 700 సంవత్సరాలక్రితం పురందరదాసు (కర్ణాటక), అన్నమాచార్యులు, క్షేత్రయ (తెలుగు) నారాయణతీర్థులు (సంస్కృతం) వాగ్గేయకారులుగా వున్నారు. అయితే కర్ణాటక సంగీతకళకు పునర్వికాసం ఈ మూర్తిత్రయంతోనే ప్రారంభమైందని విశ్లేషకుల అంచనా. వీరితో కర్ణాటక సంగీతం రసానందాన్ని, ప్రజాదరణను పొందింది. ఆ మూర్తిత్రయాన్ని ఒక్కసారి స్మరించి, వారి కీర్తనలు వింటే ఇహంలో మానసికానందం, పరంలో మోక్షం కలగటం ముమ్మాటికి నిజం.

రచన - గబ్బిట దుర్గాప్రసాద్

# ప్రవేశ పరీక్షలకు ఎలా తయారవాలి?

## (Entrance Exams - Preparation)



భారత దేశంలో ప్రవేశ పరీక్షలకు తయారయ్యే సమయం యిది. మీలో చాలామంది శిక్షణా తరగతులకు హాజరవుతూ వుండవచ్చు. కొంతమంది పరీక్షకోసం సన్నద్ధం అవుతూవుండవచ్చు. అయితే, మీలో ఎంతమందికి సరైన అభ్యసన ప్రణాళిక వుంది ? ఒక వేళ లేకపోతే, మీ కోసం చిన్న చిట్కాలను అందిస్తున్నాం. దీని వల్ల సిలబస్‌ను పూర్తి చేసుకొనే విధానం, నిర్ణిత సమయంలో ఫలితం పొందే ప్రణాళిక అందజేస్తున్నాం.

అభ్యసన ప్రణాళిక లేక స్టడీప్లాన్ రూపొందించుకోవటం - మీరు ఏర్పరచుకొనే స్టడీ ప్లాన్ వల్ల మీరు ఆశించిన గమ్యం చేరటం కొంత కష్టం కావచ్చు. అందుకని ఊహాత్మకంగా కాకుండా, వ్యూహాత్మకంగా, నిజమైన ప్రణాళిక తయారు చేసుకోవాలి. దీనివల్ల, మీకు తగిన విధంగా, మీ వేగంతో, దాన్ని అనుసరించి లబ్ధి పొందవచ్చు. దీనితో అభ్యసనం మీ అందుబాటులో చేతుల్లో వుండి, మీకు తోడ్పడుతుంది. ముందుగా మీరు ఎంత సమయం, ఎంత శ్రమ వెచ్చించగలరో నిర్ణయించుకోవాలి. దీని కోసం ఈ క్రింది ప్రశ్నలను మీరు వేసుకొని, సమాధానాలు పొందాలి.

**1) ఎంత సమాచారాన్ని మీరు పూర్తి చేయాలి? 2)?ఆ సమాచారం ఎంత కష్టమైంది ? 3) మీకు ఉన్న సమయం ఎంత? 4) ఈ అభ్యసన కాలంలో, యింకా ఏమైనా అత్యవసర విషయాల పై దృష్టి పెట్టాలా? 5) పరీక్ష విధానం ఏమిటి? 6) ఆ పరీక్ష ఎంత ప్రాముఖ్యం కలిగి వుంది?**

అభ్యసన ప్రణాళికను తయారుచేసుకోవటానికి - మీరు పూర్తి చేయాల్సిన అంశాలను గుర్తించి, వాటిని ఎప్పుడు, ఎలా, ఎంతకాలంలో, ప్రతిరోజు పూర్తిచేయాలో ప్రణాళిక తయారు చేసుకోండి. ఇప్పటికే అదంతాపూర్తి చేసి వున్నట్లైతే, పునశ్చరనకు అంటే రివిజన్‌కు, తగిన సమయాన్ని కేటాయించుకోండి, ఇంకా కోర్సుల్లో వెనుకబడి వుంటే, దాన్ని సమయానికి పూర్తి చేసి, రివిజన్‌కు సమయాన్ని ఏర్పాటు చేసుకోవాలి. పరీక్షలలో ఏమి ప్రాముఖ్యమైన అంశాలో గుర్తించుకొని, మొదలు పెట్టాలి. మీ స్టడీప్లాన్ ఏర్పరచుకోవటానికి మేమందించే చిట్కాలను పరిశీలించి, అమలుచేసుకోండి.

1) మీకున్న సమయాన్ని అర్థవంతంగా ఉపయోగించుకోండి.

2) మీ అభ్యసన కాలాన్ని చిన్న చిన్న విభాగాలుగా మార్చుకొని, అందులో మీరు చదవాల్సింది చదువుకోండి.

3) మీ కోర్సుల్లో వున్న అంశాలను కూడా, తగినట్లుగా విభజించుకొని, పైన చెప్పిన అభ్యసన వేళల్లో పూర్తి చేయండి.

4) స్పష్టమైన, నిర్దుష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, ఈ అభ్యసన కాలాన్ని సద్వినియోగం చేసుకోండి.

5) పరీక్షలలో అతి ముఖ్యమైన, ముందుగా నేర్వదగిన అంశాలకు తగిన సమయాన్ని కేటాయించుకోండి.

6) మీకు సులభంగా, మీకు అందుబాటులో వున్న వాటినీ,మీకు కష్టంగా తోచిన అంశాలను వేరు చేసుకొని, తగిన సమయంలో అభ్యసనం చేయండి.

7) చదివే కాలాన్ని మరీ పెద్దగా పొడిగించకండి.

8) నిశ్శబ్దం పాటించండి. శబ్దం వుంటే చదవటానికి ఎక్కువ శ్రమ పడాల్సి వస్తుంది. స్ట్రెస్ పెరుగుతుంది. అందుకని ప్రశాంత వాతావరణం వున్న ప్రదేశంలోనో, గ్రంథాలయంలోనో అభ్యసన ప్రక్రియ చేపట్టండి.

9) స్టడీసెషన్సులో వైవిధ్యంతో కూడిన విషయాలను ఎంపిక చేసుకొని, బోర్ కొట్టిన అంశాలను చేర్చుకొని ప్రభావ వంతమైన అభ్యసనం చేయండి.

10) మిమ్మల్ని మీరే మదింపు చేసుకోండి. నిర్ధారణ, ప్రాక్టికల్ టెస్టులను చేసుకోండి. మీరు ఏ అంశాలలో బలహీనులో గుర్తించుకొని, వాటిని అధిగమించి, సాధించండి, చదివేటప్పుడు పూర్తిగా, ఆ విషయంపై దృష్టి కేంద్రీకరించండి.

11) పరీక్షల ముందు హడావిడిగా బట్టి పట్టే విధానం మంచిదికాదు.

12) తగినంత విశ్రాంతి సమయాలను పొందుతూ, చదివి మీ లక్ష్యాన్ని సాధించండి.

కనుక మీరు రాసే ప్రవేశ పరీక్ష ఎంత ముఖ్యమైనదో తెలుసుకోండి. పరీక్షకు తయారయ్యేటప్పుడు చిన్న చిన్న, ప్రణాళికా బద్ధమైన, మంచి సోపానాలు నిర్మించుకొని, మీ అభ్యసనం అర్థవంతంగా పూర్తి చేయండి. ప్రతి అడుగు అర్థవంతమై, తర్వాత దానికి సోపానంగా ఉండాలి. దానిపై మీ అభ్యసన భవనం క్రమంగా, నిర్దుష్టంగా, నిర్మించుకోవాలి. ఇవికాక మీకు లభించిన, చిట్కాలు, సలహాలు అనుసరించి, మీ సమస్యల్ని దిగ్విజయంగా చేయండి.

రచన - గబ్బిట దుర్గాప్రసాద్ **మీ అందరికి విజయోభవ.**